క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పూజలు



స్వామి, అమ్మవార్లకు పూజలు

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పల్లకిసేవ

దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దయాకర్‌రెడ్డి–శిరీష దంపతులు వ్యవహరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పల్లకిసేవ నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం తానా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇటీవల తానా ఆధ్వర్యంలో అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

న్యూ ఇయర్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

ముత్తుకూరు : న్యూ ఇయర్ వేడుకలను యువకులు ప్రశాంతంగా జరుపుకోవాలని ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బందికరంగా బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్ చేయవద్దని, గొడవలకు పాల్పడ వద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

మనుబోలు : నిబంధనల మేరకు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా కుటుంబాలతో కలిసి జరుపుకోవాలన్నారు. 31న రాత్రి మద్యం సేవించడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డీజే సౌండ్ ఏర్పాటు చేయడం, బాణసంచా పేల్చడం నిషేధమన్నారు. ఇతరులకు ఇబ్బందుల్లేకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మైపాడులో ఉచిత వైద్యశిబిరం నేడు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు రెయిన్‌బో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పెన్నేటి సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రెయిన్‌బో హాస్పిటల్ ఆధ్వర్యంలో నెమ్ము, ఊపిరితిత్తులు, కిడ్నీ, మూత్రకోశ, ఎముకలు, కీళ్లు, కండరాలు, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ముందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలి కాచుకుంటుండగా బాలికకు గాయాలు

పొదలకూరు : పట్టణంలోని శ్రామికనగర్ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న బాలిక శనివారం చలికాచుకుంటూ ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గాయపడింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఉదయం చలితీవ్రత అధికంగా ఉండడంతో కాలనీవాసులు చలిమంట వేశారు. అక్కడకు వెళ్లిన బాలిక చలికాచుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు శిల్క్ గౌనుకు నిప్పంటుకుని శరీరం కాలింది. హుటాహుటిన కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్లు నెల్లూరు జీజీహెచ్‌కు చేజర్ల అంబులెన్స్‌లో పంపారు. బాలిక పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది వెల్లడించారు.

10 నుంచి వెంకటాచలంలో క్రికెట్ పోటీలు

వెంకటాచలం : సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 10వ తేదీ నుంచి వెంకటాచలంలో వీపీఎల్(వెంకటాచలం ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది టీమ్‌లు పాల్గొంటాయని, వీపీఎల్ విజేతకు రూ.1.20 లక్షలు, రన్నర్‌గా నిలిచే జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. వెంకటాచలం మండల యువతను ప్రోత్సహించాలనే ఆలోచనతో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

కొలువుదీరుతున్న పక్కా ఊళ్లు

- జగనన్న లేఅవుట్లలో వేగంగా ఇళ్ల నిర్మాణం
- వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాల నిర్మాణం
- మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు
- పొదలకూరులో 1000 ఇళ్ల నిర్మాణం



పొదలకూరు జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం

పొదలకూరు : పక్కా ఇళ్ల నిర్మాణంలో వేగం పెరిగింది. జగనన్న లేఅవుట్లలో ఏకంగా ఊర్లే కొలువుదీరుతున్నాయి. ఒక్కసారిగా వెయ్యిళ్ల నిర్మాణం పొదలకూరుకు సమీపంలోని లేఅవుట్లో చేపడుతుండడంతో ఆ ప్రాంతానికి కొత్త కాంతులతో పాటు స్థలం విలువ విపరీతంగా పెరిగింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతినిత్యం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. గతంలో మండలం నుడా పరిధిలో లేకపోవడం వల్ల ఇళ్ల మంజూరులో జాప్యం జరిగింది. కేవలం పీఎంజీఏవై కింద మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు కావడం వల్ల అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయారు. అయితే ఏడాది క్రితం కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి అయిన వెంటనే మండలాన్ని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) పరిధిలోకి తీసుకురావడంతో వేల సంఖ్యలో పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయి పనుల్లో వేగం పెరిగింది. కాలనీల్లో మౌలిక వసతుల కింద ముందుగా బోర్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నుడా కింద 4,879 ఇళ్లకు సంబంధించి వ్యక్తిగత, జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. పొదలకూరు పట్టణానికి సంబంధించి 1,400 మందికి చిట్టేపల్లి తిప్పను చదును చేసి ప్లాట్లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడో ఆప్షన్ కింద పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి అందజేసేందుకు పనులు శరవేగంగా చేపట్టారు. మండలంలో 162 ఎకరాల్లో రూ.15 కోట్ల నిధులతో 77 జగనన్న లేఅవుట్లను నిర్మించారు.

పేదలందరికీ నివేశన స్థలాలు

మండలానికే పొదలకూరు జగనన్న లేఅవుట్ తలమానికంగా మారనుంది. ఎన్నో ఏళ్లుగా పట్టణానికి చెందిన పేదలకు నివేశన స్థలాలు అందజేసింది లేదు. గత ప్రభుత్వంలో స్థలాలకు సంబంధించి పట్టాలు అందజేసినా పొజిషన్ చూపలేదు. దీంతో మంత్రి కాకాణి చొరవ తీసుకుని సమీపంలోని 707 సర్వే నంబర్‌లో తిప్పను చదును చేయించి 1,400 ప్లాట్లు ఏర్పాటు చేయించారు. అవి కూడా చాలకపోవడంతో అదనంగా సమీపంలోనే మరో లేఅవుట్ నిర్మించి పేదలకు నివేశన స్థలాలను పంపిణీ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పొదలకూరు పంచాయతీలో మంత్రి కాకాణి పదిరోజుల పాటు నిర్వహించిన సందర్భంగా నివేశన స్థలాలు కావాలని పలువురు విజ్ఞప్తి చేయడంతో జగనన్న లేఅవుట్లో స్థలాలను అందజేశారు.

అన్నిహంగులతో..

పొదలకూరు జగనన్న కాలనీలో అన్ని హంగులతో పక్కా ఇళ్లను నిర్మిస్తున్నారు. ముందుగా వెయ్యిళ్లను వేగంగా నిర్మిస్తున్నారు. అవి పూర్తయిన తర్వాత మరో 200 ఇళ్లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 500 ఇళ్లకు శ్లాబులు కూడా పడి



విద్యుత్ స్తంభాల నిర్మాణం

పోవడంతో అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతామని అధికారులు వెల్లడించారు. కాలనీలో ముందుగా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వందల సంఖ్యలో స్తంభాలను నిర్మించి తీగలు లాగి విద్యుత్‌ను సరఫరా చేశారు. తాగునీటి కోసం బోర్ల నిర్మాణం చేపట్టగా నీరు సరిగ్గా పడకపోవడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ కాలనీ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు సర్వశక్తులు ఒడ్డినా న్యాయస్థానాల ద్వారా ప్రభుత్వం అనుమతులు పొందింది.

సంతోషంగా ఉంది



జగనన్న కాలనీలో ఇల్ల నిర్మాణం పూర్తయితే వెళ్లి గృహప్రవేశం చేస్తాం. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కోసం ఎదురు చూస్తున్నాం. ఇల్లు నిర్మించుకోలేని తమకు ప్రభుత్వమే నిర్మించి అందజేయడం సంతోషంగా ఉంది. కూలీనాలీ చేసుకునే మేము అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం.

– చలంచర్ల నరసమ్మ, పొదలకూరు

కల నెరవేరింది



మా సొంతింటి కల నెరవేరింది. ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉంది. సొంత ఇంటిని నిర్మించుకుని వెళ్తామని ఎప్పుడూ అనుకోలేదు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పక్కా ఇల్లు అందజేయడం ఊహించలేదు.

– ఇండ్ల చెంచమ్మ, పొదలకూరు

నిర్మాణంలో వేగం పెరిగింది



ప్రస్తుతం ఇళ్ల నిర్మాణంలో వేగం పెరిగింది. మూడు ఆప్షన్ల ద్వారా ఇళ్లను నిర్మిస్తున్నాం. పొదలకూరులో కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లను నిర్మిస్తున్నాం. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్నాం. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే అర్హులైన ప్రతి వ్యక్తికీ ఇల్లును మంజూరు చేశాం. అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తున్నాం.

– శివమోహన్, హౌసింగ్ ఏఈ, పొదలకూరు

వైభవంగా శోభాయాత్ర



నేత్రపర్వంగా అక్షతల శోభాయాత్ర



సీతారాముల ఊరేగింపు

- ప్రతి గ్రామానికి అక్షతలు

పొదలకూరు : అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన శ్రీరాముని అక్షతలకు పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత దేవస్థానం నుంచి శోభాయాత్ర చేపట్టి రామనగర్‌గేటు సెంటర్ మీదుగా రామమందిరం వద్ద హారతులు ఇచ్చారు. అక్కడి నుంచి శివాలయం వరకు యాత్రను నిర్వహించారు. యాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ బాధ్యులకు అక్షతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యులు మాట్లాడుతూ అయోధ్య రామమందిరంలో జనవరి 22న విగ్రహ ప్రతిష్ట సమయానికి దేశంలో 25 కోట్ల కుటుంబాలకు అక్షతలు చేరేలా ధార్మిక సంస్థలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట రోజున ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచారక్ సురేష్, జనార్ధన్‌రెడ్డి, అక్షింతల వితరణ కమిటీ సభ్యులు సుందరరాజా, ధనుంజయరావు, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్, లక్కాకుల ఆనందరావు, రాచపూటి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

పొదలకూరు : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జనవరి 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ నగేష్‌కుమారి శనివారం వెల్లడించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాల్సిందిగా కోరారు.

దేవగిరిక్షేత్రంలో పండరి భజన నేడు

పొదలకూరు : పట్టణానికి సమీపంలో చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న నారాయణస్వామి మందిరం దేవగిరిక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు పండరిభజన ప్రదర్శన ఉంటుందని భజన గురువుల బృందం శనివారం తెలిపింది. ప్రతి ఏడాది భజన గురువులు ఏకాదశికి ముందు మహారాష్ట్రలోని పండరీపురంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజనను ప్రదర్శిస్తారు. ఏడాది చివరి రోజున ఎక్కడో ఒకచోట దేవస్థానాల్లో పండరి భజన ప్రదర్శిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది దేవగిరిక్షేత్రాన్ని ఎంచుకుని జిల్లాస్థాయి గురువులంతా భజన చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భజనను వీక్షించాల్సిందిగా కోరారు.

గాలికుంటు వ్యాక్సిన్‌లు వేయించండి

మనుబోలు : పాడి రైతులందరూ వారి పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్‌లు వేయించాలని పశు సంవర్ధకశాఖ డీడీ నాగమణి సూచించారు. స్థానిక పశువైద్యశాలను ఆమె శుక్రవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్‌లు వేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట మనుబోలు, నెల్లూరు పశు వైద్యశాల ఏడీలు గురవారెడ్డి, సురేష్, మనుబోలు, వెంకటాచలం పశు వైద్యాధికారులు కార్తీక్, షరీఫ్, వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ నాగమణి

పోలింగ్ కేంద్రాల్లో వసతులు బాగుండాలి

కోవూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు బాగుండాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని పాటూరు, కోవూరు, పడుగుపాడు ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి వసతి తప్పక ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 7వ తేదీలోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.పద్మజ, ఆర్‌ఐ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **విడవలూరు :** మండలంలోని పార్లపల్లి, విడవలూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జేసీ కూర్మనాథ్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతుల కల్పనకు జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ రమాదేవి, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, రవి దర్శిని, మహిళా కానిస్టేబుల్ శ్రీలేఖ పాల్గొన్నారు.



కోవూరు : పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

గ్రామసభలో టీడీపీ నేత హల్‌చల్

కోవూరు : విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ గ్రామసభలో ఓ టీడీపీ నేత హల్‌చల్ చేశాడు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ హాజరు కాకపోవడంతో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి ఇమామ్‌బాషా అధ్యక్ష స్థానంలో కూర్చొని గ్రామసభ నిర్వహించాలని హుకూం జారీ చేశాడు. ఉపాధి సిబ్బంది ప్రేమ్‌కుమార్, ఇలియాజ్‌లతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ కోటయ్య అక్కడే ఉన్నప్పటికీ ఇమామ్‌బాషాను అడ్డుకోలేదు. ఉపాధి సిబ్బంది ఇలా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు దృష్టి సారించాలని మండల స్థాయి అధికారులు కోరుతున్నారు.

దేశంలోనే జనాకర్షక నేత వైఎస్ జగన్



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

ముత్తుకూరు : దేశంలోనే గొప్ప జనాకర్షణ కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 200 మంది యువకులు శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి యువకులే కీలకమన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత కూడా వైఎస్ జగన్‌దేనన్నారు. యువకుల గురించి ఆలోచన చేసేది కూడా ఆయనేనన్నారు. సినీనటుడు పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని చాలా మంది యువకులు ఆశించారని, కానీ చివరకు ఆయన చంద్రబాబును సీఎం చేయాలని నిర్ణయించి, యువకులను మోసం చేశాడన్నారు. చంద్రబాబుది నిలకడలేని మనస్తత్వమన్నారు. కుప్పంలో ఆయన చేసిన ప్రసంగాలే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రానికి సమర్థవంతమైన పాలన, నాయకత్వం అందించగలిగే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు.

జిల్లా నుంచి సోమిరెడ్డి పరారీ తప్పదు

రాబోయే ఎన్నికల్లో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరో మారు ఓటమిపాలై జిల్లా నుంచి పరారీ తప్పదని మంత్రి కాకాణి ఎద్దేవా చేశారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ విజయం సాధించే వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ఎంపీటీసీ రావి విజయకుమార్‌రెడ్డి, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నడవడి ముత్యంగౌడ్, రాగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమారెడ్డి నెల్లూరులోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, వీరి చలపతి, రజత్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

రిపబ్లిక్ డేకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

- వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం: ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే క్యాంప్ 2024కు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ(వీఎస్‌యూ) ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపిక కావడం గర్వకారణమని వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపికైన వలంటీర్లు ఎస్.అనిత, కె.చందనలను అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిపబ్లిక్ డే క్యాంపునకు ఒకరు ఎంపిక కావడమే కష్టమని, వీఎస్‌యూ నుంచి ఇద్దరు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. దీని వెనుక ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కృషి ఎంతో ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వలంటీర్లను అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ముత్తుకూరు : విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఎఫ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో సీఎస్సార్ ద్వారా యూపీస్కూల్‌కు రూ.50,000ల విలువ గల రెండు కంప్యూటర్లు, వాటి పరికరాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జెమినీ ఫ్యాక్టరీ ద్వారా త్వరలో అదనపు గది నిర్మాణం జరుగుతుందన్నారు.

యూపీస్కూల్ హెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ఫ్యాక్టరీ అధికారి సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంప్యూటర్ల అందజేత

పోటాపోటీగా ఆడుదాం ఆంధ్రా



కోవూరు : పోటీలను ప్రారంభిస్తున్న జేసీ కూర్మనాథ్



కొడవలూరు : వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శనివారం పోటాపోటీగా సాగాయి. ఇక్కడ గండవరం, గౌతమ్‌నగర్ సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో క్రీడాజట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రూ.వంద కోట్లు వెచ్చించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ముజీర్‌బాషా, మాగుంట ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి, సునీల్‌కుమార్, మారంరెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఉల్లాసంగా..

కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను సర్పంచ్ విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీటీసీ వేణుగోపాల్, ఎంఈఓ రహీమ్, హెచ్‌ఎం నరసింహమూర్తి, పీడీలు దేవిక, రమణయ్య, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఉత్సాహం నింపిన జేసీ

కోవూరు జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న క్రీడాపోటీలను జేసీ కూర్మనాథ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.



కొడవలూరు : ఖోఖో పోటీలో క్రీడాకారులు



కొడవలూరు : గండవరంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ